

## డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి ధ్యేయం కావాలి

- **జెడ్ పి హెచ్ ఎస్, లో బాల, బాలికలకు క్రీడలు. వ్యాసరచన పోటీలు.**
- **ఎస్ ఐ విట్టల్ రెడ్డి**

**యాలాల జూన్ 24(ప్రజాస్వరం):**

యాలాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాలల పోలీసులు బాలబాలికలకు వ్యాసరచన, బుధవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు యాలాల ఎస్సై విట్టల్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ కు దూరంగా ఉండాలని మన తోటి వారు కూడా డ్రగ్స్ భూతానికి అలవాటు పడకుండా చూసుకోవాలని డ్రగ్స్ వల్ల ఆరోగ్యం పాడవుతుందని కుటుంబాలు వీధిన పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిద్రామేశ్వర్, రవీందర్ రెడ్డి, పిడి రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఏ.ఎస్సై. రామచందర్, హెడ్ కానిస్టేబుల్ నర్సిములు, జగదీష్, విమెన్ పి సి అనురాధ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థుల ప్రతిజ్ఞ

**శంకర్‌పల్లి, జూన్ 24(ప్రజాస్వరం):**

యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా చైతన్యపరిచే లక్ష్యంతో శంకర్‌పల్లిలోని చైతన్య జూనియర్ కళాశాలలో స్థానిక పోలీసు శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు సురేష్, శ్రీశైలం విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి నుంచి దూరంగా ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి, ఇంగ్లిష్ లెక్చరర్ సునీల్, మ్యాథమెటిక్స్ లెక్చరర్ మల్లికార్జున, తెలుగు లెక్చరర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## ఉప్పరపల్లిలో ఆస్తి వివాదం.. కన్న తండ్రిపై కుమారుడు దాడి

**రాజేంద్రనగర్ జూన్ 24(ప్రజాస్వరం):**

ఆస్తికోసం కన్నతండ్రిపైనే కుమారుడు దాడి చేశాడు. ఆస్తుల ముందు అనుబంధాలు నిలవడం లేదంటూ నిరూపించే అమానుష ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పరపల్లిలో చోటుచేసుకుంది. కుమారుడి నుంచి ప్రాణహాని ఉందంటూ తండ్రి అనంత్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొడుకు నుంచి రక్షించాలంటూ తండ్రి పోలీసులను ఆశ్రయించారు. తన కొడుకు చంపేస్తానని హెచ్చరించినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాను కష్టపడి సంపాదించిన భూమిని తన ఇద్దరు కొడుకులకు సమానంగా పంచి ఇచ్చేసిన అనంత్ రెడ్డి, వృద్ధాప్యంలో తనకు ఆసరాగా ఉంటుందని 300 గజాల స్థలాన్ని ఉంచుకున్నాడు. చిన్న కొడుకు ఆ స్థలాన్ని తన పేరుమీద రాసి ఇవ్వాలని గొడవకు దిగాడు. తండ్రి పై కొడుకు దాడి చేసిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనపై అనంతరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న రాజేంద్ర నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.




## మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో కుంగిన భూమి

**మంచిర్యాల జిల్లా జూన్ 24(ప్రజాస్వరం):**

మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో ఓ అనూహ్య ఘటన జరిగింది. బుధవారం ఉదయం సమయంలో అకౌంట్ సెక్షన్ గదిలో ఫీటు లోతుతో భూమి ఒక్కసారిగా కుంగిపోయింది. దీంతో సామాగ్రి అంతా చిందరవందరంగా అయ్యింది. ఆ సమయంలో కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భవనం నిర్మించే సమయంలోనే నాణ్యత ప్రమాణాలు సక్రమంగా పాటించకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని పలువురు అంటున్నారు.



# నిరుద్యోగుల గొంతుక పాలమూరు మట్టి బిడ్డ ఆస్మా

తెలంగాణలో పాలమూరు అంటే కేవలం ఒక జిల్లా పేరు కాదు. అది వలస బతుకుల చిరునామా. రోజువారీ కూలి కోసం మహారాష్ట్ర, కర్ణాటక వెళ్లే కుటుంబాల ఆర్తనాదం. పాలమూరు మట్టిలో బతుకు పుట్టడం అంటే, పోరాటాన్ని జన్మతః అందిపుచ్చుకోవడం. అలాంటి ఆ మట్టిలో అస్మా పుట్టింది.

చదువు వాసన తెలియని ఇంట్లో కళ్లు తెరిచింది. ఆకలి కేకలు లాలిపాటలుగా పెరిగింది. అతి చిన్న వయసులోనే అమ్మ నీడ దూరమైంది. నాన్న అండ కోల్పోయింది. ఇద్దరి చేతుల ఆసరా పోయినప్పుడు సామాన్యంగా మనిషి కుంగిపోతాడు. కానీ అస్మా కుంగలేదు. ఆ కన్నీళ్లే ఆమెకు కసి అయ్యాయి. ఆ ఆకలి కేకలే ఆమెలో పోరాట చైతన్యాన్ని రగిలించాయి.



**కుట్టు మిషన్ తిప్పిన చేయి — పుస్తకం పట్టింది**

బతుకుదెరువు కోసం చేతులు కుట్టు మిషన్ తిప్పాయి. అదే చేతులు రేపటి కోసం పుస్తకం పట్టుకున్నాయి. ఇది కేవలం కవితా భాష కాదు, అస్మా జీవితంలో జరిగిన వాస్తవం. ఒక వైపు కుటుంబ పోషణ , మరొక వైపు విద్యాసాధన, రెండింటినీ ఒకేసారి నిర్వహించడం సాధారణమైన పని కాదు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరున ఉన్న లైబ్రరీ ఆమెకు ఇల్లైంది. ఆ గ్రంథాలయం కేవలం పుస్తకాల గది కాదు, అది ఒక సిద్ధాంత పాఠశాల. అక్కడ ఆమె పరీక్షలకు మాత్రమే చదవలేదు. అంబేద్కర్ రాసిన మాటలు చదివింది. పూలే దంపతుల పోరాట చరిత్ర అందిపుచ్చుకుంది. హక్కు అంటే ఏమిటో, సమానత్వం అంటే ఏమిటో, ఆ నాలుగు గోడల మధ్య నేర్చుకుంది. ఉదయం తొమ్మిది నుండి రాత్రి పదకొండు వరకు ఆ లైబ్రరీయే ఆమె ప్రపంచం. సెలవులు లేవు. అలసట సాకు కాదు. పేదరికం అడ్డంకి కాదు. అక్షరం అక్షరం శ్రమతో చదివి, TET పాసైంది. NET సాధించింది. SET అర్హత పొందింది. ఒక్కసారి కాదు, అన్నీ. రెండు సార్లు జూనియర్ లెక్చరర్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ వరకు వెళ్ళింది. ఉద్యోగం ఆమె సొంతం అనుకుంది. కానీ కాలం ఆమెకు మరో పోరాటాన్ని ఇచ్చింది. ఈ విజయాలు కేవలం ఒక అమ్మాయి సాధించిన అర్హతలు కాదు, అవి వ్యవస్థ ముఖాన విసిరిన ధిక్కారం.

**సావిత్రిబాయి పూలే నడిచిన దారిలో**

పంతొమ్మిదవ శతాబ్దంలో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు ఒక మహత్తర సత్యాన్ని ప్రపంచానికి చాటారు. విద్యే సమాజ పరివర్తనకు తొలి ఆయుధం. అణగారిన వర్గాల స్త్రీలకు చదువు నేర్పడం అప్పటి సమాజం నిషేధించింది. రాళ్లు రువ్వారు. వ్యతిరేకించారు. అయినా సావిత్రిబాయి పాఠశాల తలుపులు తెరిచారు. "విద్య లేకుండా హక్కులు రావు. హక్కులు లేకుంటే మనుషులకు గౌరవం ఉండదు" ఈ నమ్మకమే ఆమె ఆయుధం. అస్మా జీవితం ఆ నమ్మకానికి సజీవ నిదర్శనం. కుట్టు మిషన్ తిప్పుతూ పుస్తకం పట్టుకున్న ఆ చేయి, పూలే దంపతుల కలకు కొనసాగింపు.

పేదరికం, అనాథత్వం, సామాజిక వివక్ష, ఏదీ ఆమె చదువుకు అడ్డు నిలవలేదు. అంబేద్కర్ లైబ్రరీలో ఆమె అందిపుచ్చుకున్న భావజాలం ఒక్కటే, తన హక్కు తనకు దక్కకపోతే వ్యవస్థ ముందు వంగిపోవడం కాదు, గళం విప్పడం. అందుకే ఆమె పోరాటం వీధులలో మొదలైంది.

**ముసుగు ఆమె ధైర్యాన్ని అడ్డుకోలేదు — మహిళా సాధికారత అంటే ఇదే**

మన సమాజంలో ఒక స్టీరియోటైప్ బలంగా ఉంది . బురఖా ధరించే మహిళ ఇంటికే పరిమితమవుతుందని, ఆమె గొంతు బయటికి రాదని. ఈ అపోహను అస్మా ధైర్యంగా, పదే పదే, బహిరంగంగా బద్దలు కొట్టింది. ఆ ముసుగు స్వేచ్ఛకు సంకెళ్లు కాదు, ఆమె ఆత్మవిశ్వాసానికి గుర్తు. ఆ వస్త్రంతోనే ఆమె వేలాది నిరుద్యోగుల ముందు నిలబడింది. ఆ ముఖంతోనే అధికార వ్యవస్థను ప్రశ్నించింది. ధర్నాల్లో నిలబడింది. ర్యాలీలలో నడిచింది. మీడియా ముందు మాట్లాడింది. ఎన్నికల్లో పోటీ చేసింది. మహిళా సాధికారత అంటే కేవలం అక్షరాస్యత కాదు, ఉద్యోగం మాత్రమే కాదు, తన హక్కు కోసం నిలబడగలగడం, తన సమాజం కోసం గళమెత్తగలగడం. అస్మా అదే చేసింది. చరిత్ర సాక్షిగా చూస్తే, ఐలమ్మ భూమి కోసం పోరాడింది. రుద్రమదేవి రాజ్యం కోసం పోరాడింది. ఢిల్లీని నేలిన రజియా సుల్తానా అధికారం కోసం పోరాడింది. ఇప్పుడు అస్మా లక్షలాది నిరుద్యోగుల ఆకలి కోసం పోరాడుతోంది. ఆ వరుసలోనే ఈ తెలంగాణ మహిళ చరిత్రలో నిలబడుతోంది.

**ఉద్యమం ఇందిరా పార్క్ నుండి జూబ్లీహిల్స్ వరకు**

అస్మా పోరాటం కేవలం మాటలకే పరిమితం కాలేదు. ఇందిరా పార్క్ వేదికగా ధర్నాలు చేసింది. నిరుద్యోగ ర్యాలీలు నిర్వహించింది. రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వ అధికారులను నేరుగా నిలదీసింది.

రాజకీయ పార్టీలు నిరుద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలు పట్టించుకోవడం లేదన్న వాస్తవాన్ని ఆమె బహిరంగంగా చెప్పింది. నిరుద్యోగుల గొంతుకగా తానే చట్టసభలో పోరాడాలని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిలబడింది. ఆ నిర్ణయం చాలా ధైర్య సాహసాలు అవసరమయ్యే పని. వనరులు లేవు. పార్టీ నిధులు లేవు. అయినా అస్మా ఆ ఎన్నికలో నిలబడింది, నిరుద్యోగ సమస్యలను నేరుగా చట్టసభ వరకు తీసుకెళ్లేందుకు. ఫలితంగా రాజకీయ పార్టీలన్నీ నిరుద్యోగ అంశాలను తమ ఎన్నికల ప్రచారంలో చర్చకు తీసుకురాక తప్పలేదు. ఇది చిన్న విజయం కాదు.



**పరమత సహనం**

**అందరి కోసం అందరితో**

అస్మా పోరాటంలో మరో గొప్ప సందేశం ఉంది, పరమత సహనం. ఆమె ఒక మతానికి చెందినప్పటికీ ఆమె గొంతు అన్ని కులాల, అన్ని మతాల నిరుద్యోగుల గొంతు. TET పాసైన హిందూ అభ్యర్థి అయినా, SET పాసైన క్రైస్తవ విద్యార్థి అయినా, అందరి కష్టం ఒక్కటే, అందరి ఆశ ఒక్కటే.

భారత రాజ్యాంగం ఆర్టికల్ 15 మతం, జాతి, కులం, లింగం, జన్మస్థలం ఆధారంగా వివక్ష చూపడాన్ని నిషేధించింది. ఆర్టికల్ 16 ఉద్యోగ అవకాశాల్లో సమానత్వాన్ని హామీ ఇచ్చింది. ఆ రాజ్యాంగ స్ఫూర్తిని అస్మా తన పోరాటంలో జీవింపజేస్తోంది.

ఆమె చూపు ఒక వర్గానికి పరిమితం కాదు, సరిహద్దుల వరకు, అడవుల వరకు, కొండల వరకు విస్తరించిన ఒక సమ్మిళిత న్యాయ దృష్టి. నిరుద్యోగ యువత మాత్రమే కాదు, మహిళా సాధికారత, తెలంగాణ అస్తిత్వం, రైతు సమస్యలు, జర్నలిస్టుల హక్కులు, ప్రతి అంశంలో ఆమె గొంతు వినిపిస్తోంది.

**నిరుద్యోగ యువత ప్రధాన డిమాండ్లు**

అస్మా నేతృత్వంలో తెలంగాణ నిరుద్యోగ యువత ఏళ్ల తరబడి పోరాడుతున్న ప్రధాన డిమాండ్లు, మేగా DSC జంబో నోటిఫికేషన్, అన్యాయమైన జి.వో.లు రద్దు, గ్రూప్స్ మరియు పవర్ సెక్టార్ నోటిఫికేషన్లు వెంటనే విడుదల, OTR నమోదుపై చివరి తేదీ విధించకపోవడం, మరియు వయోపరిమితి సడలింపు, ఇవి కేవలం ఒక వ్యక్తి కోసం కాదు, లక్షలాది అర్హుల న్యాయం కోసం. సామాజిక న్యాయం అనేది కేవలం ఎన్నికల నినాదం కాదు. అది ప్రతి రోజు వ్యవస్థ నిలబెట్టాల్సిన బాధ్యత. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, జాబ్ క్యాలెండర్ సకాలంలో విడుదల, అర్హత సాధించిన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాత పరిగణన, ఇవే సామాజిక న్యాయపు మెట్లు. అస్మా పోరాటం ఈ మెట్లు ఎక్కించే ప్రయత్నం.

**వ్యవస్థ చేసిన తప్పిదం ఒక అగ్నిపర్వతం పుట్టింది**

అర్హత సాధించిన తర్వాత ఉద్యోగం రావడం న్యాయమని అందరూ అనుకుంటారు. అస్మా కూడా అదే అనుకుంది. TET, NET, SET అన్నీ పాసైంది. అన్నీ అర్హతలూ ఉన్నాయి. కానీ ఉద్యోగం రాలేదు. వ్యవస్థ చేసిన తప్పిదం ఆమె కలలను ముక్కలు చేసింది. కానీ ఆ ఆవేదన నుండే ఒక అగ్నిపర్వతం ఉద్భవించింది. కన్నీళ్లు ఆగిపోయాయి. గొంతు గర్జించింది. ఒక నిర్ణయం తీసుకుంది. తన ఉద్యోగం కోసం కాదు, తనలాంటి లక్షలాది మంది నిరుద్యోగుల ఆశల కోసం పోరాటం చేయాలని. తెలంగాణలో వేలాది మంది అభ్యర్థులు TET, NET, SET, పోలీస్ ఉద్యోగానికి అర్హతలు సాధించి ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. జాబ్ క్యాలెండర్ వస్తుందని ఆశతో ఉన్నారు. కానీ నిరీక్షణ సంవత్సరాలుగా సాగుతోంది.

**తెలంగాణ అభివృద్ధి**

**నిజమైన సార్థకత**

తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగింది. అమర వీరులు త్యాగాలు చేశారు. ఆ త్యాగాలు సార్థకం కావాలంటే, అర్హత ఉన్న ప్రతి యువకుడికి ఉద్యోగం రావాలి. ప్రతి పరీక్ష పారదర్శకంగా జరగాలి. ప్రతి నోటిఫికేషన్ సకాలంలో రావాలి. అస్మా పోరాటం ఆ లక్ష్యం వైపే సాగుతోంది. కోట్లాది మంది సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం, నీళ్లు, నిధులు, నియామకాలతో కూడిన సామాజిక తెలంగాణగా రూపొందాలని ఆమె అలుపెరగక పోరాడుతోంది.

**ముగింపు**

అస్మా కథ చదివినప్పుడు మనకు అర్థమవుతుంది, ఇది ఒక్కరి కథ కాదు. ఆమె ఒంటరి కాదు. ఆమె పక్కన పూలే దంపతుల స్ఫూర్తి ఉంది. ఆమె చేతిలో అంబేద్కర్ రాజ్యాంగం ఆయుధంగా ఉంది. ఆమె గొంతులో లక్షలాది నిరుద్యోగుల వేదన ఉంది. పేదరికంలో పుట్టి, అనాథత్వాన్ని జయించి, పరీక్షలన్నీ పాసై, అయినా సరే వ్యవస్థతో పోరాటం చేస్తున్న ఈ మహిళ, ప్రతి సామాన్యుని పోరాట విజయానికి నిదర్శనం. పాలమూరు మట్టిలో పుట్టిన ఈ నల్ల గులాబీ నేడు తెలంగాణ నిరుద్యోగుల రేపటి ఆశల దీపమైంది.

## మాతృత్వానికే మచ్చ.. ప్రియుడితో కలిసి పిల్లలపై చిత్రహింసలు

- **ఒంటినిండా కాలిన గాయాలతో ఇద్దరు చిన్నారులు.. తల్లి, ప్రియుడు అరెస్ట్**



**హైదరాబాద్, జూన్ 24(ప్రజాస్వరం):**

మాతృత్వానికే మచ్చ తెచ్చేలా ఓ తల్లి తన ప్రియుడితో కలిసి కన్నబిడ్డలపై అమానుషంగా చిత్రహింసలకు పాల్పడిన ఘటన వెలుగుచూసింది. అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులను రోజూ వేధిస్తూ, వారి శరీరాలపై వాతలు పెట్టి తీవ్ర గాయాలకు గురిచేయడం స్థానికంగా తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన పింకీదేవి, సుజీత్ దంపతులు మూడేళ్ల క్రితం ఉపాధి కోసం వచ్చి స్థానిక పరిశ్రమలో కార్మికులుగా పని చేస్తున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో పింకీదేవికి చిందుకుమార్ అనే వ్యక్తితో ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. భార్య ప్రవర్తనపై తరచూ గొడవలు జరుగుతుండటంతో భర్త సుజీత్ మూడు నెలల క్రితం ఇంటిని విడిచి వెళ్లిపోయాడు. అనంతరం పింకీదేవి తన ప్రియుడు చిందుకుమార్‌ను ఇంటికే తీసుకొచ్చి సహజీవనం ప్రారంభించింది. తమ సంబంధానికి పిల్లలు అడ్డుగా ఉన్నారనే కారణంతో ఆరేళ్ల కుమార్తె ప్రియాంక, నాలుగేళ్ల కుమారుడు ఆదిత్యపై ఇద్దరూ కలిసి దారుణంగా హింసకు పాల్పడ్డారు. చిన్నారుల శరీరాలపై వాతలు పెట్టడం, కాలిన గాయాలు చేయడం, తీవ్రంగా కొట్టడం వంటి క్రూర చర్యలను నిత్యకృత్యంగా మార్చుకున్నట్లు తెలిసింది. ఇంటి నుంచి తరచూ చిన్నారుల ఏడుపులు, అరుపులు వినిపించడంతో అనుమానం వచ్చిన కాలనీవాసులు బుధవారం ఇంటికి వెళ్లి పరిశీలించారు. అక్కడ చిన్నారుల ఒంటిపై తీవ్ర గాయాలు, కాలిన మచ్చలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. దీంతో ఆగ్రహించిన స్థానికులు తల్లి, ఆమె ప్రియుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు చిన్నారులను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తల్లి పింకీదేవి, ఆమె ప్రియుడు చిందుకుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. చిన్నారులపై జరిగిన అమానుష హింసకు సంబంధించిన అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## న్యాలట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

- **విద్యార్థులకు అండగా వరంగల్ రాజమౌళి కుటుంబ సభ్యులు**

**చేవెళ్ల జూన్ 24(ప్రజాస్వరం):**

చేవెళ్ల మండల పరిధిలోని న్యాలట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా తాండూరుకు చెందిన వరంగల్ రాజమౌళి కుటుంబ సభ్యులు తమ సేవా భావాన్ని చాటుతూ పాఠశాలలోని విద్యార్థులకు నూతన స్కూల్ బ్యాగులను అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. చిన్నారులు ఆనందోత్సాహాల మధ్య బ్యాగులను స్వీకరించగా, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు దాతల సేవా దృక్పథాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుపై ఆసక్తి మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న దాతలు, సేవా దృక్పథం కలిగిన కుటుంబాలు ముందుకు వచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేపడుతున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని, గ్రామ పెద్దలు మరియు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ రాజమౌళి కుటుంబ సభ్యులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుచ్చయ్య, ఉప సర్పంచ్ అశోక్, మాజీ సర్పంచ్ లక్ష్మీ సత్యనారాయణ, స్కూల్ హెడ్మాస్టర్ హసీనబేగం, టీచర్స్ రాజశేఖర్, హరిశెంకర్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999